క్లుప్తంగా

భీమా కోరేగావ్ విజయ్ దివస్


నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు

సీటీఆర్ఐ: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యాన సోమవారం భీమా కోరేగావ్ విజయ దివస్ ఘనంగా నిర్వహించారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమా కోరేగావ్ స్తూపం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భీమా కోరేగావ్ కేవలం 500 మంది మహర్ రెజిమెంట్‌తో పీష్వా సైన్యాన్ని ఓడించిందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, పట్టణాల విజయ్ కుమార్, నక్కా వెంకట రత్నం పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలతో ఊరేగింపు


అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షతలతో భక్తులు

కడియం: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షతలతో మురమండలోని పెద్ద రామాలయం నుంచి సోమవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మూడు రామాలయాల మీదుగా షిర్డీసాయి పంచాయతన క్షేత్రంలోని రామాలయం వద్దకు చేరుకుంది. ఆయా ఆలయాల్లో అక్షతలను ఉంచి ప్రత్యేక పూజలు చేసి, ఇంటింటికీ అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మొగలపు వెంకటేశ్వర్లు, కంటిపూడి సుశీలదేవి, మొగలపు ఝాన్సీ, ప్రత్తిపాటి వెంకట రామయ్య చౌదరి, నెక్కంటి వీరవెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి కలెక్టర్ పూజలు


స్వామి సన్నిధిలో కలెక్టర్ మాధవీలత, కుటుంబ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలకు అంతా మంచి జరగాలని పూజలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

241 మందికి వైద్య పరీక్షలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరాల్లో 241 మందికి పరీక్షలు చేశారు. సోమవారం సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ డి.ఉమామహేష్ సేవలందించారు. శ్రీరామకృష్ణ మఠం వారి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 168 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారి నిర్వహించిన శిబిరంలో 73 మందికి కంటి పరీక్షలు చేసి, ఐదుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకటనారాయణ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సలార్
సూర్యమినీ	:	అక్వామేన్
సూర్యప్యాలెస్	:	సలార్
స్వామి	:	హాయ్‌నాన్న
శివజ్యోతి	:	ఉమాపతి
అనుశ్రీ	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	అక్వామేన్
అప్సర	:	యానిమల్
నామవరం		
బీఎస్ మహల్	:	సలార్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	డెవిల్
కడియం		
వెంకటసూర్య	:	డెవిల్

న్యూ ఇయర్ ఉత్సాహం


ఎంపీ భరత్ రామ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సన్మానిస్తున్న అభిమానులు

- సందడిగా కొత్త సంవత్సరం వేడుకలు
- 2024కు ఘన స్వాగతం
- ఎటుచూసినా కోలాహలం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సంబరాలు మొదలయ్యాయి. ప్రజలందరూ కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఇళ్ల ముందు రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల వద్దకు కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

శుభాలు కలగాలి : ఎంపీ భరత్ రామ్

నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఎంపీ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ఎన్నికల సంవత్సరమని, రాష్ట్రాభివృద్ధిని కోరుతూ ప్రతి ఒక్కరూ జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి జగనన్న రూ.లక్షల కోట్లు వెచ్చించారన్నారు. నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దానని, అందుకు సీఎం జగనన్న అందజేసిన సహకారం ప్రోత్సాహం మరువలేనిదన్నారు. విశ్వనగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. మోరంపూడి పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే మార్చి నెలకు జాతికి అంకితం చేయబోతున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరాన్ని ఆనుకుని జాతీయ రహదారిపై ఉన్న బొమ్మూరు, వేమగిరి, లాలాచెరువు, దివాన్ చెరువు, ఫ్యూచర్ కిడ్స్ వద్ద ఐదు ఎఫ్‌ఓబీలను తీసుకురానున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి శాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయని, శంకుస్థాపన చేయడమే తరువాయి అన్నారు. గోదావరిపై మరో కొత్త వంతెన రానుందన్నారు. ఎయిర్ పోర్ట్‌ను రూ.350 కోట్లు, రైల్వే స్టేషన్ రూ.300 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. రైల్వేస్టేషన్లో 4, 5 ప్లాట్‌ఫాంలు తీసుకొచ్చామని, తూర్పు వైపున 6వ ప్లాట్ ఫాం కూడా రానుందని వివరించారు.


నగర కోఆర్డినేటర్ గూడూరు శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు


రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సుఖ సంతోషాలతో ఉండాలి : జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని ఆయన ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు జిల్లాలోని వివిధ నియోజక వర్గాలకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో, ప్రజల సహకారంతో నాలుగున్నర ఏళ్లలో రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబంలోనూ ఆనందం నింపే సంవత్సరంగా 2024 గుర్తుండిపోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు.

నగర వైశ్య సంఘం ఆధ్వర్యంలో..

నగర వైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

చందన కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చందన నాగేశ్వర్‌కు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నాలుగున్నరేళ్లలో నియోజకవర్గాన్ని రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రాబోయే ఎన్నికలలో ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

రుడా చైర్మన్ నివాసంలో..


రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నివాసంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. తొలుత వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం రౌతు సేన ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. రుడా కార్యాలయం అధికారులు, సిబ్బంది, నగర పాలకసంస్థ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. వారందరికీ తిరుపతి శ్రీవారి ప్రసాదం అందజేశారు. వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు, నగర ప్రముఖులు పాలసానపల్లి హనుమంతరావు, వాకచర్ల కృష్ణ, పెదిరెడ్ల శ్రీనివాస్, పోలు విజయలక్ష్మి, రాష్ట్ర తెలికుల, గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ సంకిస భవానీ ప్రియ, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ దుంగా మంగ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తరలివచ్చిన అభిమానులు

నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. సోమవారం ఆయన నివాసంలో న్యూ ఈయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి డీసీసీబీ ఉన్నతాధికారులు, డీసీసీబీ డైరెక్టర్లు, సొసైటీ చైర్‌పర్సన్లు, సీఈవోలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆకుల వీర్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే గోరంట్ల నివాసంలో..

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త రషీద్‌కు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, గొందేశి పూర్ణ చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు.

నూతన సంవత్సర సందడి

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత కేక్ కటింగ్ తదితర కార్యక్రమాలతో యువత ఉత్సాహంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. సోమవారం ఉదయం నుంచే ఆలయాలకు క్యూ కట్టారు. మండలంలోని అన్ని ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగింది. ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ప్రముఖ నాయకులను ఆయా పార్టీల కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు గిరజాల వీర్రాజు, రావిపాటి రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీషచంద్ర స్టాలిన్, ఎంపీపీ వెలుగు బంటి సత్య ప్రసాద్ తదితరులను ఆయా పార్టీల నాయకులు, ప్రభుత్వ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ కడియం మండల నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు చేతుల మీదు గా డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు సబ్బితి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో..

ప్రకాశం నగర్: ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు సందడిగా జరిగాయి. ముందుగా పూజా కార్యక్రమం నిర్వహించారు. రూరల్, సిటీ నియోజకవర్గాల నుంచి శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వారితో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. పిల్లి సుబ్రహ్మణ్యంతో పాటు తనయుడు పిల్లి సిరిబాలకు శుభాకాంక్షలు తెలిపారు. పిల్లి గంగాధర్, కురుమిల్లి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సహకార బ్యాంకు సీఈవో, సిబ్బంది


రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ప్రజలు


పిల్లి సుబ్రహ్మణ్యం, సిరిబాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

సీతాఫలం.. జోరుగా విక్రయం


స్టేడియం రోడ్డులో విక్రయానికి సిద్ధం చేసిన సీతాఫలాలు

- మహారాష్ట్ర నుంచి దిగుమతి
- స్టేడియం రోడ్డులో అమ్మకాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని స్టేడియం రోడ్డు సీతాఫలం అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంతో పాటు ఈ ఏడాది మహారాష్ట్ర నుంచి వచ్చిన సీతాఫలాలు సైతం మార్కెట్‌లో లభిస్తున్నాయి. సైజును బట్టి పరక కాయలను రూ.300 నుంచి రూ.800 వరకూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మెట్టప్రాంతంలో సీతాఫలాలు దిగుబడి తగ్గుముఖం పడడంతో మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సీతాఫలాలు అధికసంఖ్యలో తీసుకువస్తున్నారు.


అంతర పంటగా..

మహారాష్ట్రలో శ్రీగంధం మొక్కలు పెంపకానికి లైసెన్సు ఇవ్వడంతో పాటు, సబ్సిడీ, అలాగే రూ.7 వేలు ఎకరానికి పెట్టుబడిగా ఇస్తున్నారు. దీంతో అక్కడి రైతులు శ్రీగంధం మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. నల్లతుమ్మ పండే నేలలో మాత్రమే ఈ పంట పండుతుంది. అయితే ఈ పంట 20 ఏళ్ల తర్వాత చేతికి వస్తుంది. ఈలోగా రైతు ఆర్థికంగా నిలబడేందుకు శ్రీగంధం మొక్కల పంటలో అంతర పంటగా సీతాఫలాలను వేస్తున్నారు. దీంతో ప్రతి ఏడాదీ రైతుకు ఆదాయంతో పాటు, నలుగురికి ఉపాధి సైతం దొరుకుతుంది. స్థానిక సీతాఫలం వ్యాపారులకు సైతం వెసులుబాటుగా ఉంది.

సీజన్‌లో అమ్మకాలు

స్టేడియం రోడ్డులో సీజన్‌లో అధిక సంఖ్యలో సీతాఫలాలను సైకిళ్లపై వ్యాపారులు విక్రయించేవారు. ప్రస్తుతం సీజన్‌కు చివరి దశకు చేరడంతో 20 మంది మాత్రమే అమ్మకాలు సాగిస్తున్నారు. రాజమహేంద్రవరం తదితర ప్రాంత ప్రజలతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు ఇక్కడ సీతాఫలాలను కొనుగోలు చేసుకుని తీసుకు వెళుతుంటారు. సీజన్‌లో అత్యధికంగా సైకిల్ వ్యాపారులతో స్టేడియంరోడ్డు సీతాఫలాలతో కళకళలాడుతూ ఉండేది.

ఉపాధి లభిస్తోంది



ప్రస్తుతం మన జిల్లాలో సీతాఫలం పంట దిగుబడి తగ్గడంతో మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అక్కడ శ్రీగంధం మొక్కలలో అంతర పంటగా వీటిని వేస్తున్నారు. దీనివల్ల రైతులతో పాటు వ్యాపారులకు ఉపాధి దొరుకుతోంది.

– మాదారపు శ్రీను, వ్యాపారి, శ్రీరామపురం

కరోనా మహమ్మారిపై అప్రమత్తం

- ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వార్డు
- అందుబాటులో మందులు
- వైద్య సిబ్బంది నియామకం


ప్రభుత్వాసుపత్రిలోని కోవిడ్ వార్డు



ఆక్సిజన్ ప్లాంటు

కంబాలచెరువు: కరోనా చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కరోనా జేఎన్ 1 వైరస్ వ్యాప్తి చెందిన విషయం తెలిసిందే. వ్యాధి తీవ్రత పెరిగితే దానికి అనుగుణంగా చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల రాజమహేంద్రవరంలో కరోనా కేసు వెలుగు చూసిన నేపథ్యంలో, దానికి ఎదుర్కొనేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వార్డు సిద్ధం చేశారు.


పది పడకల వార్డు

రాజమహేంద్రవరంలోని బోధనాసుపత్రిలో 10 పడకల ప్రత్యేక ఐసీయూ వార్డును సిద్ధం చేశారు. అందులో అవసరమైన అన్ని రకాల వైద్య సామగ్రి, రోగికి అవసరమైన ఆక్సిజన్, వెంటిలేటర్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కోవిడ్ లక్షణాలతో వచ్చిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి, వారికి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచారు. గతంలోని కోవిడ్ కేసుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులు, వైద్యులు ముందుకెళుతున్నారు. ఆక్సిజన్ ఇబ్బందులు లేకుండా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆక్సిజన్ ప్లాంట్‌ను పూర్తిగా సిద్ధం చేశారు. రెండు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు, ఒక 1000 ఎల్‌పీఎల్ పీఎస్ఏ ప్లాంట్ అందుబాటులో ఉన్నాయి. అలాగే 110 వెంటిలేటర్లు, 100కు పైగా ఆక్సిజన్ సిలెండర్లు సిద్ధంగా ఉంచారు. అయితే కోవిడ్ వార్డులో ఒక పాజిటివ్ కేసు మాత్రమే ఉంది. ఆ వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని ఆసుపత్రి వైద్య వర్గాలు తెలిపాయి. మినహా ప్రభుత్వాసుపత్రిలో ఎటువంటి కోవిడ్ పాజిటివ్ రోగులు లేరని తెలిపారు.

ప్రత్యేక పరీక్ష కేంద్రం ఏర్పాటు

ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ల్యాబ్‌లో కోవిడ్ పరీక్షలను గతంలో నిర్వహించేవారు. అయితే రోగులు, ఆసుపత్రికి వచ్చేవారు భయాందోళనలు చెందుతున్న నేపథ్యంలో ఆసుపత్రి ప్రాంగణంలోని ఒక మూల ప్రాంతంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి అందులో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, రొంప, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి వంటి లక్షణాలతో ఆసుపత్రికి వస్తే వైద్య సిబ్బంది కరోనా పరీక్షల గదికి పంపుతున్నారు. అలాగే గత కరోనాలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌తో కొంతమేర ఇబ్బందులు పడేవారు. దీంతో పూర్తి స్థాయి ఆక్సిజన్ ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఇతర రాష్ట్రాలలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఆసుపత్రి ప్రత్యేక వార్డులో ఒక కోవిడ్ కేసు మాత్రమే ఉంది. అతడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు. ఒకవేళ కోవిడ్ కేసులు పెరిగితే వాటిని ఎదుర్కొనేందుకు రెడీగా ఉన్నాం. రెండు రోజుల పాటు జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోండి. అలాగే ప్రజలు మాస్కులు ధరించాలి, భౌతికదూరం పాటించాలి, నిరంతరం చేతులను శుభ్రం చేసుకోవాలి.

– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్, బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం

పాలంగి తేగ.. టేస్ట్ భలేగా


పాలంగిలో తేగలను శుభ్రం చేస్తున్న అమ్మకందారుడు

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి ప్రాంతంలో తయారైన తేగలకు నిడదవోలు, తణుకు నియోజకవర్గాల్లో చెప్పలేనంత డిమాండ్. ప్రస్తుతం తేగల సీజన్ కావడంతో ఈ గ్రామంలో తయారైన తేగలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. పాలంగి ప్రాంతంలోని తేగలు బాగా ఊరతాయి. అదీగాక ఇక్కడి మట్టి మహిమో, మరేమో గాని వాటి రుచి అమోఘం. ఏటా సెప్టెంబర్ నుంచి జనవరి వరకూ పాలంగి ప్రాంతంలో తేగల విక్రయాలు జోరుగా సాగుతాయి. పెద్ద సైజు తేగల కట్ట (సుమారు 10 తేగలు) రూ.100, చిన్న సైజు తేగల కట్ట రూ.50, మరీ చిన్నతేగల కట్ట రూ.20 రేటుకు వ్యాపారులు అమ్ముతున్నారు. తేగల ధర అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది వాటిని కొనుగోలు చేసి ఇష్టంగా తింటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 100 కుటుంబాలు ఏటా ఈ సీజన్‌లో తేగల విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. పూర్వం రైతులు పొలంలో తేగల పాతర వేసి, ఊరాక తవ్వి తీసి, కాల్చి వాటిని ఇంటికి తీసుకు వచ్చేవారు. దాంతో ఇంట్లో వారంతా రెండు, మూడు రోజుల పాటు వాటిని తినేవారు. ప్రస్తుతం చాలామంది రైతులు పొలాల్లోని తాటి చెట్లను తొలగించారు. అదీగాక తేగల పాతర వేయడానికి రైతులు, కౌలుదారులు ఇప్పుడు అనాసక్తి చూపుతున్నారు. దాంతో ఒకప్పుడు ఉచితంగా లభించే తేగలను ఇప్పుడు డబ్బు పెట్టి కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం


విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న వేద పండితులు

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీలో కొత్తగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మొదలయ్యాయి. పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో మహా సంకల్పం, హోమాలు, యాగశాల ప్రవేశం వంటి క్రతువులు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకకు విచ్చేసిన పండితులకు ఆలయ కమిటీ, అర్చకుడు రంగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పలువురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు పూజలు జరుగుతాయి.

నేటి నుంచి రెండో విడత సురక్ష వైద్య శిబిరాలు

డీఎల్‌డీవో శాంతమణి వెల్లడి


శాంతమణి డీఎల్‌డీవో, కొవ్వూరు

కొవ్వూరు: డివిజన్‌లో మంగళవారం నుంచి నెలాఖరు వరకూ రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు డీఎల్‌డీవో వి.శాంతమణి తెలిపారు. 2న తాళ్లపూడి మండలం మలకపల్లి పీహెచ్‌సీ పరిధిలోని బల్లిపాడు, దేవరపల్లి మండలం గౌరీపట్నం పీహెచ్‌సీ పరిధిలోని గౌరీపట్నంలోను, కొవ్వూరు మండలం మార్కొండపాడు పీహెచ్‌సీ పరిధిలోని మద్దూరులోను, నిడదవోలు మండలం సమిశ్రగూడెం పీహెచ్‌సీ పరిధిలోని సింగవరంలోను, ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని చివటం గ్రామంలోనూ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని క్రిస్టియన్ పేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని సచివాలయంలోను, నిడదవోలు నెహ్రూ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లోను, ఈనెల 5న గోపాలపురం పీహెచ్‌సీ పరిధిలోని వేళ్లచింతల గూడెంలోను, నల్లజర్ల మండలంలోని దూబచర్లలోను, చాగల్లు మండలం నందిగంపాడులోను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. 9న రాజం పాలెం, దొమ్మేరు-2లోను, మల్లవరం-1లోను, కోరుమామిడి-1, ఉండ్రాజవరం-2 సచివాలయాల పరిధిలోను శిబిరాలు కొనసాగుతాయన్నారు. 10, 17, 24, 31తేదీల్లో కొవ్వూరు క్రిస్టియన్ పేట, నిడదవోలు నెహ్రూ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలోను, 12న వేగేశ్వరపురం-2, అన్నదేవర పేట-1 లోను, దేవరపల్లి-2లోను ,19న ప్రక్కిలంక, జగన్నాథపురంలోను, దుమంతునిగూడెంలోను, ధర్మవరం, బ్రాహ్మణగూడెం-1, సమిశ్రగూడెం-2, పసలపూడి సచివాలయాల పరిధిలోను నిర్వహిస్తారు. 23న గోపాలపురం-1, అనంతపల్లి-2, కుమారదేవం-1లోను, చాగల్లు-2, తాడిమళ్ల-2, ఉండ్రాజవరం-1, ఖండపల్లి-3 సచివాలయ పరిధిలోను,27న తాళ్లపూడి-1 లోను, చిన్నాయిగూడెం-2 లోను,30న పెద్దేవం-1లోను, కరగపాడు, నందమూరు,ఉనగట్ల సచివాలయ పరిధిలోను శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.